క్లుప్తంగా

340 మందికి వైద్య సేవలు



మాచరలో సేవలందిస్తున్న వైద్యులు

కపిలేశ్వరపురం: మండలంలోని మాచరలో శుక్రవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరంలో వాకతిప్ప పీహెచ్‌సీ పరిధిలోని 340 మందికి వైద్య సేవలందించారు. శస్త్రచికిత్స నిపుణుడు శ్రావణి, వాకతిప్ప పీహెచ్‌సీ వైద్యుడు చిట్టూరి రాకేష్ చౌదరి రోగులకు చికిత్స అందించారు. 302 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. 38 మందికి కంటి పరీక్షలు చేశారు. 70 మందికి ల్యాబ్ పరీక్షలు చేసి ఆరోగ్య సమస్యలను గుర్తించారు. ఎంపీహెచ్‌ఈఓ బిషప్, ఎంపీహెచ్‌ఎస్ వీఎస్ కామేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ, వైద్య ఆరోగ్య, ఆశ కార్యకర్తలు వైద్యసేవలనందించారు.

సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలి

మండపేట: వేసవి ముగిసేంత వరకూ విద్యుత్ కోతలు లేకుండా చూడాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ ఆ శాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గురువారం రాత్రంతా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. నాలుగు రోజులుగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 నుంచి 45 డిగ్రీల వరకూ నమోదవుతున్న తరుణంలో ఇంటి పట్టున ఉండే వారికి కరెంటు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఉద్యోగుల ఆశయాలు ఆదర్శం కావాలి



ఉద్యోగ విరమణ చేసిన గండి మాణిక్యాంబ, అప్పారావు దంపతులను సన్మానిస్తున్న వనుం శ్రీనివాస్, వైద్యాధికారులు

కాజులూరు: విశ్రాంత ఉద్యోగుల ఆశయాలు, అనుభవాలు భావితరం ఉద్యోగులకు ఆదర్శం కావాలని అలయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ వనుం శ్రీనివాస్ అన్నారు. గత కొన్నేళ్లుగా గొల్లపాలెం పీహెచ్‌సీలో హెల్త్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న గండి మాణిక్యాంబ శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు సౌజన్య, శ్రేయల ఆధ్వర్యంలో సిబ్బంది హెల్త్ సూపర్‌వైజర్ గండి మాణిక్యాంబ, అప్పారావు దంపతులను ఘనంగా సన్మానించారు. వివిధ పీహెచ్‌సీల వైద్యులు, కాకినాడ ఆరోగ్యశాఖ, 108, 104 సిబ్బంది, పలు ఇతర ఉద్యోగ సంఘాల నాయకులు సన్మానంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఎం వైకుంఠరావు, ఎల్‌టీ దొరబాబు, సత్తిబాబు, నరాల రాజారావు తదితరులు పాల్గొన్నారు.

డీవీఎస్ రాజు సేవలు అభినందనీయం



డీవీఎస్ రాజు దంపతులను సత్కరిస్తున్న నేతలు

రామచంద్రపురం: ఆర్టీసీలో సుదీర్ఘంగా 33 ఏళ్ల పాటు డీవీఎస్ రాజు అందించిన సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక ఆర్టీసీ డిపోలో టీఐ 3గా ఉద్యోగ విరమణ చేసిన డీవీఎస్ రాజును శుక్రవారం జరిగిన సన్మానంలో పట్టణానికి చెందిన ప్రముఖులు, ఆర్టీసీ కార్మికులు ఘనంగా సత్కరించారు. పలువురు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారంలో రాజు తన వంతు కృషి చేసి ఆర్టీసీ కార్మికులకు అండగా నిలిచారన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ నేతలు పలువురు ప్రజా ప్రతినిధులు, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరమణ

రాయవరం: రాయవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ నౌడు వెంకటరమణ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో ఎంపీపీ వెంకటరమణ అధ్యక్షోపన్యాసం చేశారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖల ప్రగతిని వివరించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో సాదాసీదాగా సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ ఆర్‌వీ కృష్ణారావు, ఎంపీడీవో కె.వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సాగునీటిని సక్రమంగా వాడుకుందాం..



- నేడు సాగునీరు విడుదల
- సరఫరాలో శాస్త్రీయత
- ఖరీఫ్ పూర్తయ్యే వరకూ సరఫరాకు ప్రభుత్వం భరోసా
- రెండు నియోజకవర్గాల్లో 99,583 ఎకరాల సాగు
- 12,44,78,750 మిల్లీ మీటర్ల నీరు అవసరం

కపిలేశ్వరపురం: వరి సాగుకు సాగునీటి సరఫరా అత్యంత కీలకమైనది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. క్షేత్ర స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకూ పలుమార్లు సమావేశమై సాగునీటి సరఫరాపై ప్రణాళికను రూపొందించింది. అందులో భాగంగా శనివారం నీటిని విడుదల చేస్తున్నారు. శాస్త్రీయ పద్ధతిలో సాగునీరు వినియోగంపై వ్యవసాయాధికారుల సూచనల మేరకు రెండు నియోజకవర్గాల పరిధిలో సాగు నీటి సరఫరా తీరుతెన్నులపై ఈ కథనం...

రెండు నియోజకవర్గాల్లో సాగు ఇలా...

ఒక ఎకరా వరి సాగు కాలం మొత్తానికి 1,250 మిల్లీ మీటర్లు నీరు అవసరం. రామచంద్రపురం నియోజకవర్గంలో 77 గ్రామాల్లో 53,020 ఎకరాలకు 6,62,75,000 మండపేట నియోజక వర్గంలో 43 గ్రామాల్లో 46,563 ఎకరాలకు 5,82,03,750 మొత్తం రెండు నియోజకవర్గాల పరిధిలోని 120 గ్రామాల్లో 99,583 ఎకరాలకు 12,44,78,750 మిల్లీ మీటర్ల సాగు నీరు అవసరమవుతుంది.

పక్కా ప్రణాళిక ప్రకారం

ప్రభుత్వం పంట సాగులో ముందస్తు ప్రణాళికను రూపొందిస్తూ ముందుకు సాగుతుంది. దానిలో భాగంగా రబీ సాగు కొనసాగుతుండగానే ఖరీఫ్ సాగుపై దృష్టి సారించింది. సాగునీటి సరఫరాకు ఇరిగేషన్, అనుబంధ శాఖలతో జిల్లా స్థాయిలో సమీక్షలు చేసి పక్కా ప్రణాళిక రూపొందించారు.

శాస్త్రీయంగా వినియోగించుకోవాలి

నేలలో పైరుకు తడి 75 శాతం వరకూ తగ్గిపోతే నీటి ఎద్దడి ఉందంటారు. అలాగని అవసరం రాకుండా ముందస్తుగా నీరును పెట్టినా ప్రాణవాయువు దక్కక పంట దిగుబడి తగ్గిపోతుంది. నాట్లు వేసేటప్పుడు నీరు పలుచ గానూ, మూన తిరిగిన రోజు నుంచి పైరు దుబ్బు చేయడం పూర్తయ్యే వరకూ 2 సెంటిమీటర్ల నీరు ఉంటే సరిపోతుంది. చిరుపొట్ట దశ నుంచి గింజ గట్టిపడే వరకూ 5 సెంటీమీటర్ల లోతన నీరుండాలి. ఈనిక దశ, చిరుపొట్ట దశల్లో ఎట్టి పరిస్థితిలోనూ నీటి ఎద్దడి లేకుండా జాగ్రత్త వహించాలి. కోతకు పది రోజులు ముందుగా నీటిని నెమ్మదిగా తగ్గించాలి. నీరు ఎక్కువగా ఉంటే పైరు దుబ్బు బాగా చేయదు.

అండగా సాగు సలహా మండళ్లు

ప్రభుత్వం రూపొందించిన వివిధ దశల్లోని సాగు సలహా మండళ్లు సాగు ప్రక్రియకు తోడ్పాటు ఇస్తున్నాయి. ఆర్‌బీకే స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ సాగు సలహా మండళ్లను ఏర్పాటు చేసింది. దీంతో స్థానిక రైతు సూచనలు, సలహాలు సైతం పై స్థాయిలో తీసుకునే నిర్ణయాల్లో భాగమవుతున్నాయి. ఆ మండళ్లలో రెవెన్యూ, జలవనరులు, వ్యవసాయ శాఖల భాగస్వామ్యం ఉండటంతో పటిష్టమైన నిర్ణయాలకు అవకాశం ఏర్పడుతుంది.

రెండు నియోజకవర్గాల్లో రబీ వరిసాగు ఇలా..

మండలం	గ్రామాలు	వరిసాగు (ఎకరాలు)	అవసరమైన నీరు (మిల్లీ మీటర్లలో)
మండపేట	12	16,296	2,03,70,000
రాయవరం	12	14,509	1,81,36,250
కపిలేశ్వరపురం	19	15,758	1,96,97,500
రామచంద్రపురం	25	18,120	2,26,50,000
కె.గంగవరం	26	15,444	1,93,05,000
కాజులూరు	26	19,456	2,43,20,000
మొత్తం	120	99,583	12,44,78,7

ధూమపానం ఆరోగ్యానికి హానికరం

రాయవరం: పొగతాగటం వల్ల అనేక అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశముందని రాయవరం పీహెచ్‌సీ వైద్యాధికారి వి.అనిరుధ్ అన్నారు. ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవం సందర్భంగా రాయవరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ధూమపానం వల్ల ఊపిరితిత్తులు పాడై క్యాన్సర్ వంటి వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. పొగ తాగే వారికే కాదని, సమీపంలో ఆ పొగ పీల్చే వారి ఆరోగ్యానికి కూడా హాని కలుగుతుందన్నారు. క్యాన్సర్‌కు హేతువుగా మారిన ధూమపానం వల్ల వచ్చే సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ధూమపానానికి తప్పదు భారీ మూల్యం, బహిరంగ ప్రదేశాల్లో పొగతాగటం నేరం, సిగరెట్ మానండి..మీ పిల్లలను రక్షించుకోండి, పొగచిచ్చు ఆరోగ్యానికి ఉచ్చు అంటూ వైద్య ఆరోగ్య సిబ్బంది నినాదాలు చేసారు. ర్యాలీలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పొగాకు వినియోగం ప్రమాదభరితం

కపిలేశ్వరపురం: పొగాకు వినియోగం ప్రమాదభరితమైనదని అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పీఎస్‌డీ.రత్నకుమారి హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆమె ఆధ్వర్యంలో శుక్రవారం అంగర, పడమర ఖండ్రిక గ్రామాల్లో పొగాకు కలిగించే అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పొగాకు ఉత్పత్తుల వినియోగంతో ఊపిరి సంబంధిత వ్యాధులు వస్తాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, హెచ్‌ఈ బి.రామారావు, హెచ్‌వి తాతపూడి మేరీరత్నం, ఎల్‌టీ ఆలీ, వెన్నేటి వెంకటేశ్వరరావు, వైద్య, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



రాయవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు



అంగరలో పొగాకు వినియోగ దుష్పరిణామాలపై మాట్లాడుతున్న డా.రత్నకుమారి

పొగాకు వాడకం క్యాన్సర్‌కు దోహదం

కాజులూరు: పొగాకు వాడకం వలన అనేక రోగాలతో పాటు మనిషి క్యాన్సర్‌కు గురయ్యే ప్రమాదం ఉందని గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌజన్య అన్నారు. శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని పీహెచ్‌సీ సిబ్బంది గ్రామ వీధుల్లో ర్యాలీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పొగాకు అనేక ప్రమాదకర వ్యాధులకు కారణమౌతుందని ప్రభుత్వం తరచూ ప్రకటనలు చేస్తున్నప్పటికీ ప్రజలలో పూర్తి స్థాయిలో చైతన్యం రావటం లేదు. పొగాకు వాడకం తగ్గాలంటే పొగాకు ఉత్పత్తులను ప్రజలు నిషేధించాలన్నారు.



ద్రాక్షారామలో పొగాకు వ్యతిరేక ర్యాలీలు నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

రామచంద్రపురం రూరల్: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని ద్రాక్షారామలో పీహెచ్‌సీ సిబ్బంది గ్రామ వీధుల్లో ర్యాలీలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి సందీప్‌నాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది ఫ్లెక్సీలు, ప్లకార్డులు ప్రదర్శిస్తూ పొగాకు వాడటం వలన కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. ధూమపానం, పొగాకు నమలడం ప్రజలు పూర్తిగా వ్యతిరేకించాలన్నారు. పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రథమ చికిత్స, సీపీఆర్‌లపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు ప్రథమ చికిత్స, సీపీఆర్‌లపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ బ్రహ్మారెడ్డి

రామచంద్రపురం రూరల్: యనమదల అంబికాపల్లి అగ్రహారంలోని రాజరత్న నర్సింగ్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు ప్రథమ చికిత్స, సీపీఆర్‌లపై అవగాహన సదస్సు నిర్వహించారు. కర్నూలు జిల్లాకు చెందిన ప్రముఖ వైద్యుడు వి.బ్రహ్మారెడ్డి పాల్గొని కళాశాలల్లోని బైపీసీ, వైద్య, ఫార్మసీ, నర్సింగ్ చదువుతున్న విద్యార్థులకు రోగికి ప్రథమ చికిత్స చేసే విధానం, సీపీఆర్‌లపై అవగాహన కల్పించారు. కళాశాల సిబ్బంది, స్థానికులు వైద్యులు బ్రహ్మారెడ్డి అభినందన సభ నిర్వహించి వైద్యసేవలతో పాటు, వైద్య సంబంధ రచనల ద్వారా వైద్య రంగానికి ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు.

వెంకన్న స్వామికి మామిడి పండ్లతో అభిషేకం

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి శుక్రవారం 1,116 మామిడి పండ్లతో అభిషేకం జరిగింది. పట్టణానికి చెందిన కిరాణా హోల్‌సేల్ వ్యాపారి రేపాక సత్యనారాయణచే మామిడిపండ్ల అభిషేకం కన్నుల పండువగా సాగింది. గతంలో వేంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తగా సత్యనారాయణ పనిచేశారు. ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్, వివిధ వ్యాపార సంఘాలకు చెందిన ప్రతినిధులు ఈ అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట వీరీతా దేవి, ఈఓ దూనబోయిన సాయిబాబు, అర్చకుల సమక్షంలో ఈ మామిడి పండ్ల అభిషేకం జరిగింది.

అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం

అమలాపురం రూరల్: ఈదరపల్లి బైపాస్ రోడ్డులోని కోనసీమ మహాశాస్తా అయ్యప్పస్వామి ఆలయంలో 17వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకుడు కోమాళ్లపల్లి నటరాజ్ గురుస్వామి ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. భక్తురాలు గుర్రం విరజచే కాల భైరవస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరిపారు. స్వామివారికి దాతల సహకారంతో 60 గ్రాముల బంగారు హారం చేయించారు. నటరాజ్ గురుస్వామి మాట్లాడుతూ అయ్యప్ప దీక్ష చేపడితే సకల శుభాలు కలుగుతాయన్నారు. అనంతరం అన్నసమారాధనలో వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

అలజడులు సృష్టిస్తే.. అణచి వేస్తాం

- మండపేటలో పోలీసుల మాక్ డ్రిల్
- అల్లర్లను జరిగితే ఎలా నియంత్రించాలో ప్రయోగాత్మక ప్రదర్శన

మండపేట: మరో మూడు రోజుల్లో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ నేపథ్యంలో ఎక్కడైనా, ఎవరైనా అలజడులు సృష్టించినా, హింసాత్మక ఘటనలకు పాల్పడినా, ఎలా అణచివేస్తాయో వివరిస్తూ మండపేట కలువ పువ్వు సెంటర్లో పోలీసులు శుక్రవారం ఆపరేషన్ మాక్ డ్రిల్ నిర్వహించారు. అల్లర్లకు పాల్పడుతున్న వారిని చెదర గొట్టడం, టియర్ గ్యాస్, రబ్బర్ బుల్లెట్ల ప్రయోగంతో పాటు లాఠీచార్జ్‌లో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించడం వంటి ఘటనలను కళ్లకు కట్టినట్టు పోలీసులు ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ఎవరైనా అల్లర్లు సృష్టించినా, హింసకు ప్రేరేపించినా కఠిన చర్యలు తీసుకుంటామని రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ హెచ్చరించారు. కలువ పువ్వు సెంటర్‌లో కొందరు ఆందోళనకారులు ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేయగా, పోలీసులు, కేంద్ర బలగాలు సైరన్ మోగించుకుంటూ అక్కడికి వచ్చి వారిని చుట్టుముడతాయి. జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ఇక్కడ నుంచి వెళ్లిపోవాలంటూ మైకుల్లో ఆందోళనకారులను పోలీసులు హెచ్చరించగా, వారు మాట వినరు. దాంతో టియర్ గ్యాస్ ప్రయోగంతో పోలీసులు వారిని ఎలా అడ్డుకున్నదీ ప్రదర్శించారు. కొద్ది సేపటికే టైర్లకు నిప్పుపెట్టడం, దిష్టిబొమ్మ దహనం వంటి చర్యలకు ఆందోళనకారులు పాల్పడగా, లాఠీచార్జి, ఆ తర్వాత తుపాకీ కాల్పులతో వారిని పోలీసులు నియంత్రించడం వంటి అంశాలను ప్రదర్శించారు. ఇదంతా చూస్తున్న పట్టణ ప్రజలు హడలిపోయారు. అయితే ఓట్ల లెక్కింపు నాడు ఒకవేళ అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుంటే పోలీసులు తీసుకునే కఠిన చర్యల్లో భాగంగానే ఇలా మాక్ డ్రిల్ నిర్వహించారని తెలిసి ప్రజలంతా ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంత వాతావరణం నెలకొల్పే చర్యల్లో భాగంగా, ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఈ పోలీసు ప్రదర్శన నిర్వహించామన్నారు. మండపేట మున్సిపల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము మాట్లాడుతూ ఎవరూ ఎలాంటి తప్పిదాలకు పాల్పడకుండా ఓట్ల లెక్కింపు విషయంలో ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ పార్థసారథి, రూరల్, టౌన్ సీఐలు కొమ్ముల శ్రీధర్‌కుమార్, షేక్ అఖిల్ జమ, టౌన్ ఎస్‌ఐ హరికోటి శాస్త్రి, 150 మంది పోలీసులు, 30 మంది సాయుధ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఆందోళనకారులు




వివిధ రాజకీయ పక్షాల నేతలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శ్రీధర్‌కుమార్

శాంతిభద్రతలకు విఘాతం కలిగించారో..

రాయవరం: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని మండపేట రూరల్ సీఐ కె.శ్రీధర్‌కుమార్ హెచ్చరించారు. రాయవరం పోలీసుస్టేషన్‌లో శుక్రవారం ఆయన వివిధ రాజకీయ పక్షాల నేతలతో సమావేశం నిర్వహించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అంతే కాకుండా ర్యాలీలు, రాస్తారోకోలు, విజయోత్సవాలు, బాణసంచా కాల్చడం, సంబరాలు చేసుకోవడం నిషేధించడమైందన్నారు. అలాగే ఓట్ల లెక్కింపు రోజు ప్రజలు ఎవరూ రోడ్లమీద గుంపులుగా ఉండరాదని, అల్లర్లకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సై జి.నరేష్, వివిధ రాజకీయ పక్షాల నేతలు పాల్గొన్నారు.

ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ

- రెండు నియోజకవర్గాల కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి
- నేడు వెలువడనున్న ఎగ్జిట్ పోల్స్



రాయవరం: సార్వత్రిక ఎన్నికల సమరంలో చివరి ఘట్టం ఆవిష్కృతం కానుంది. మరో మూడు రోజుల్లో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో ఫలితాలపై రెండు నియోజకవర్గాల ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మే 13న ఎన్నికలు నిర్వహించినప్పటికీ, దేశవ్యాప్తంగా ఏడు విడతల్లో జరిగిన ఎన్నికలు నేటితో ముగియనున్నాయి. సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ ముగియగానే, ఎగ్జిట్ పోల్స్ వెలువడనున్నాయి. దీంతో ఎగ్జిట్ పోల్స్ ఏ పార్టీ వైపు, ఏ అభ్యర్థి గెలుస్తాడని చెప్పనున్నాయో అని అభ్యర్థులతో పాటు, ఓటర్లు ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. కౌంటింగ్ సమయం దగ్గరపడుతుండడంతో అందరి దృష్టి ఎన్నికల ఫలితాలపైనే కేంద్రీకృతమైంది. నరాలు తెగే ఉత్కంఠతో పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎదురు చూస్తున్నారు. మరోపక్క కౌంటింగ్ కోసం ఆయా పార్టీలు ప్రాంతాల వారీగా ఏజెంట్ల జాబితా రూపొందించి వారి వివరాలను ఎన్నికల అధికారులకు అందిస్తున్నారు. కౌంటింగ్‌కు అభ్యర్థులు ఇచ్చే జాబితా ఆధారంగా వారికి కౌంటింగ్ ఏజెంట్ పాసులు ఇవ్వనున్నారు.

ఎగ్జిట్ పోల్స్‌పై ఆసక్తి

పోలింగ్ ముగిసిన తర్వాత అభ్యర్థులు బూత్‌ల వారీగా లెక్కలు చూసుకున్న ప్రధాన పార్టీల అభ్యర్థులందరూ గెలుపు ధీమాతో ఉన్నారు. మార్చి 23న ప్రారంభమైన ఎన్నిక ప్రక్రియ మే 13న పోలింగ్‌తో ముగిసింది. శనివారం పోలింగ్ ముగిసిన సాయంత్రం ఆరు గంటల తర్వాత ఎగ్జిట్ పోల్స్ వెలువడనున్నాయి. అభ్యర్థుల విజయం, పార్టీల గెలుపుపై పలు సర్వేలు సోషల్ మీడియాలో ఇప్పటికే చక్కర్లు కొడుతున్నాయి. అయితే వాటిని నమ్మే పరిస్థితి లేకపోవడంతో పోలింగ్ ముగిసిన తర్వాత వివిధ సంస్థలు వెలువరించే ఎగ్జిట్‌పోల్స్‌పైనే అందరూ ఆసక్తి కనబరుస్తున్నారు. అమలాపురం పార్లమెంట్ పరిధిలో రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో పోటీ ప్రధానంగా వైఎస్సార్ సీపీ, కూటమి అభ్యర్థుల మధ్యే ఉంది. మహిళలు, వృద్ధుల ఓటింగ్ అధికంగా ఉండడంతో రెండు వైఎస్సార్ సీపీకే విజయావకాశాలు అధికంగా ఉన్నాయనే వాదన బలంగా ఉంది. రాష్ట్రంలో తిరిగి వైఎస్సార్ సీపీయే అధికారంలోకి రాబోతుందా? అత్యధిక ఎంపీ సీట్లు ఏ పార్టీకి దక్కుతాయి? కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వమే వస్తుందా? బీజేపీ ప్రచారం చేసినట్లుగా ఎన్డీయే కూటమికి 400 సీట్లు వస్తాయా? లేవా? ఎగ్జిట్ పోల్స్ ఏ పార్టీ వైపు మొగ్గ చూపనున్నాయోనని ఓటర్లు ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు.

కౌంట్‌డౌన్ ప్రారంభం

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించి కౌంట్‌డౌన్ మొదలైంది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ మేరకు జూన్ 4వ తేదీ ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుంది. రామచంద్రపురం నియోజకవర్గంలో 239 పోలింగ్ బూత్‌ల్లో 1,73,917 ఓట్లు పోలయ్యాయి. పోలైన ఓట్లలో 87,429 మంది పురుషులు, 86,487 మంది స్త్రీలు, ఒక ట్రాన్స్‌జెండర్ ఉన్నారు. అలాగే మండపేట నియోజకవర్గంలో 223 పోలింగ్ బూత్‌ల పరిధిలో 1,91,959 ఓట్లు పోలయ్యాయి. పోలైన ఓట్లలో 94,222 మంది పురుషులు, 97,735 మంది స్త్రీలు, ఇరువురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు.

శ్రీ మదనగోపాల స్వామి వారి దేవస్థానం
దేవాదాయ ధర్మాదాయశాఖ, కుయ్యేరు గ్రామం, కాజులూరు మండలం, కాకినాడ జిల్లా
కౌలు హక్కునకు టెండర్-కమ్-బహిరంగ వేలం ప్రకటన 2వ సారి
[illegible] 2024-25 [illegible] 2026-2027 [illegible] తే.13-06-2024 [illegible] గురువారము ఉదయం గం.9-00లకు కుయ్యేరు గ్రామంలో శ్రీ స్వామి వారి దేవస్థానం వద్ద దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారులచే టెండర్-కమ్-బహిరంగ వేలం పాటలు జరుపబడును.

క్ర.నెం.	గ్రామం	సర్వే నెం.	విస్తీర్ణం	పల్లం/మెరక	ధరవత్తు	సాల్వెన్సీ సర్టిఫికేట్
1.	కుయ్యేరు	379/1	0-90	పల్లం	5,000/-	1,00,000
2.	కుయ్యేరు	379/1	1-15	పల్లం	5,000/-	1,00,000
3.	కుయ్యేరు	390/2	0-60	పల్లం	5,000/-	60,000
4.	కుయ్యేరు	26/1, 32/10	0-34	పల్లం	5,000/-	60,000
5.	కుయ్యేరు	51/2	0-38	పల్లం	5,000/-	60,000

బహిరంగ వేలం పాట షరతులు
1) [illegible]
2) [illegible]
3) [illegible]
4) [illegible]
5) [illegible]
6) [illegible]
స్థలం : కుయ్యేరు, తేది : 01-06-2024. కార్యనిర్వహణాధికారి

శ్రీ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం
దేవాదాయ ధర్మాదాయశాఖ, కుయ్యేరు గ్రామం, కాజులూరు మండలం, కాకినాడ జిల్లా
కౌలు హక్కునకు టెండర్-కమ్-బహిరంగ వేలం ప్రకటన 2వ సారి
[illegible] 2024-25 [illegible] 2026-2027 [illegible] తే.13-06-2024 [illegible] గురువారము మధ్యాహ్నం గం.12-00లకు కుయ్యేరు గ్రామంలో శ్రీ స్వామి వారి దేవస్థానం వద్ద దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారులచే టెండర్-కమ్-బహిరంగ వేలం పాటలు జరుపబడును.

క్ర.నెం.	గ్రామం	సర్వే నెం.	విస్తీర్ణం	పల్లం/మెరక	ధరవత్తు	సాల్వెన్సీ సర్టిఫికేట్
1.	కుయ్యేరు	74/11, 74/12	1-25	పల్లం	5,000/-	1,00,000
2.	కుయ్యేరు	383	4-14	పల్లం	5,000/-	3,00,000
3.	కుయ్యేరు	74/4, 74/11	1-26	పల్లం	5,000/-	1,00,000
4.	కుయ్యేరు	383	1-88	పల్లం	5,000/-	1,00,000
5.	కుయ్యేరు	113/1	1-00	పల్లం	5,000/-	1,00,000
6.	కుయ్యేరు	383	0-61	పల్లం	5,000/-	60,000

బహిరంగ వేలం పాట షరతులు
1) [illegible]
2) [illegible]
3) [illegible]
4) [illegible]
5) [illegible]
6) [illegible]
స్థలం : కుయ్యేరు, తేది : 01-06-2024. కార్యనిర్వహణాధికారి